# క్షణ భంగురమ్

నాకు ఆ వూరు కొత్తగా ట్రాన్స్ఫరైంది. ఎంత వెతికినా ఎక్కడా ఇళ్ళు దొరకలేదు. ఊరు చివర రాజానగరం కాలనీలో వెతకమన్నారు కొందరు. ఊరికి దూరం అవడంవల్ల కార్లూ, నౌకర్లూ ఉంటేనే అక్కడ ఉండటానికి సదుపాయం గానీ, నాలాంటి మధ్యతరగతి వాళ్ళు ఆ అద్దెలూ పెట్టుకోలేరు; ఆ పేటకి వెళ్ళి రిక్షాలకి డబ్బు తగలేసుకోనూ లేరు. అయినా చేసేదిలేక అక్కడే వెతికాం. ఒక పెద్ద ఆఫీసరుగారు ఆ బంగళా అంతా అద్దెకు తీసుకున్నారట; 'కావాలంటే ఔట్ హౌస్ మీ కిస్తా' మన్నారు. ఏదో అద్దె మాట్లాడుకున్నాం. ఔట్ హౌస్ అయినా వేరే బాత్రూమ్; వేరే కొళాయి, వాళ్ళతో సంబంధం లేకుండా వీధివేపు తలుపూ వున్నాయి. మాకు నచ్చింది; చేరాం.

నాదేం పోయింది, ప్రొద్దుట పదింటికి వెళితే సాయంత్రం ఆరయ్యే వరకూ రావాలనుకున్నా రావటం పడదు. కాని మా మాణిక్యానికే బాధ. నా భార్య మొదట్నుంచీ పదిమందిలో మెసిలిన మనిషి. పది గంటలకి నాకు అన్నంపెట్టేసి పంపిస్తే పదకొండు గంటలకల్లా తన భోజనం. మిగతా పనులూ అయిపోతాయి. అక్క

ప్పొంచి సాయంత్రం ఆరు వరకూ (గంటలు ఎలాగూ లెక్కపెడు తుంది) నిమిషాలు కూడా లెక్కబెట్టవలసివొస్తోంది. మొదటిరోజునే విసుగు పుట్టింది మాణిక్యానికి. నేను రాగానే గోల పెట్టేసింది.ఎన్నో రోజులనుంచీ మాట్లాడ్డానికే వాచిపోయినట్టు.

పోనీ ఇంటివాళ్ళు ఏమైనా కలుషగోరుతనంగా ఉంటారా అంటే అదేమీ లేదు. ఇంటావిడ మా మాణిక్యానికి అయిదు రోజుల వరకూ మొహమే చూపించలేదట. వాళ్ళ వంటింటి కిటికీ మాకు కొంచెం దగ్గరగా కనిపిస్తుందిగాని, అందులో ఎవరో ఒక 'మొగ అతను వంట చేస్తునట్లుందిగాని ఆడమనిషి అలికిడి లేదంది మాణిక్యం. వారెవరో వంటవాణ్ణి పెట్టుకోగల భాగ్యశాలురు గాబోలు. పోనీ పొరుగు చూదామా అంటే అదీ ఒక పెద్ద బంగళా (కుక్కలు ఉన్నవి జాగ్రత్త అనే బోర్డుతో సహా). మా ఔట్‌హౌస్ నానుకొని ఆ బంగళా లోనూ ఒక ఔట్ హౌస్ ఉందిగాని నిశ్శబ్దం. అందులో దిగటానికి ఎవరూ తయారవలేదన్నమాట,ఇంకాను.పోనీ అందులో నయినా మా బోటి వాళ్ళెవరో దిగితే మాణిక్యానికి కొంచెం ఊబుసు పోయేది.

పది రోజులు దాటింది గాబోలు. ఒకనాడు రాత్రి మాటుమణి గేక ఏదో చప్పుడవుతూందంటూ మాణిక్యం లేపింది నన్ను. పక్క నున్న ఔట్‌హౌసులోంచి ఒక మగ గొంతుక, ఒక ఆడ గొంతుకా వినిపించాయి. ఎవరో అక్కడ ఇదివరకటినుంచీ ఉంటూ అప్పుడే ఏదో ఊర్నించి వచ్చినట్టుగా ఉంది ఆ సందడి. మాణిక్యానికి స్నేహితురాలు ఏర్పాటవుతుందని అనుకుంటూ పడుకున్నా.

పక్క ఔట్ హౌసూ, మాదీ మరీ దగ్గిర. లేందల్లా ఒక్క ద్వారమే. ఒకే గోడని అనుకుని అటూ ఇటూ ఉన్నాయి ఈ రెం డూను. ఆ గోడైనా మందడి గోడేమో. ఏ మాత్రమో పల్చనే అని

చెప్పాలి. ఏమాత్రం గట్టిగా మాట్లాడినా ఒకరి మాటలొకరికి విని పిస్తాయి. మెయిన్ గేటుకి సంబంధం లేకుండా మాకున్నట్టే వాళ్ళకి వీధిలోకి దారి ఉంది.

సరే; వాళ్లు వొచ్చినట్టు మాకు తెలిసినట్టుగానే మేం యిందులో దిగినట్టు వాళ్ళకి తొందరగానే తెలియాలి. మాణిక్యంతో మర్నాడు పది గంటలకి నేను ఆఫీసుకి వెళుతున్నప్పుడే చెప్పాను. ఇవాళనించీ కాలాన్ని దుర్వినియోగం చెయ్యకుండా కొత్త స్నేహి తురాలితో పరిచయం కలుపుకో - అని. కాని మాణిక్యం వాళ్ళతో స్నేహం చేసుకోలేదు.

మొదటిరోజేమో - 'వాళ్ళెవరో అసలు తెలియకుండా ఎలా గండీ ?' అంది. రెండో రోజు ఏదో సెలవొచ్చి నేను ఇంటిదగ్గరే వుండిపోయాను. మూడో రోజు 'ఆవిడే వస్తుందేమో అని చూశా' నన్నది మాణిక్యం. నాలుగో రోజు - అయిదో రోజు - యిలా కొన్నాళ్ళు - 'ఏదో లెద్దురూ, వాళ్ళ రేడియో పగల స్తమానం పాడుతోంది. ఏదో నాకూ గోడ చాటునించి అవన్నీ వినబడుతూ కొంత కాలక్షేపం అవుతోంది' ఇలా అనీ. మొగాయన ఉన్నా డేమో అని చెబుతూ మరో రోజూ మొత్తంమీద పరిచయం చేసు కోనే లేదు. నేను రోజూ ఆఫీసునుంచి వొచ్చిన తర్వాత ఏదో సమయం చూసి అడుగుతూ వుండడమూ, మాణిక్యం ఏదో యిలాటి కారణం చెబుతూ వుండటమూ అయింది కొన్నాళ్ళు. అసలు కార ణం నేను వూహించక పోలేదనుకోండి.

ఈ రోజుల్లో ఎవరు ముందుగా స్నేహం అర్థించి పరిచయం కోరితే వాళ్ళు తేలిక. రెండో వాళ్ళు వీళ్ళమీద కొంచెం ఆధిక్యం వెలగబెడతారు.

* * *

మా పొరుగు వాళ్ళు చాలా హుషారుగా ఉంటారని గమనించాను. వాళ్ళు కొత్తగా పెళ్ళయినదంపతులయి ఉండాలి. మేనత్త మేనమామ పిల్లలో, లేక మేనమామా మేనకోడలో - ఇలాటి దగ్గిర బంధుత్వమేదో ఉండి ఉండాలి వాళ్ళకి. వివాహ బంధం గాక, ఇంకా బాగా చిన్నవాళ్ళు. ఇరవైఏళ్ళలోపు అతనికి, పదహారేళ్ళో ఏమో ఆమెకి వుండాలి. పెళ్ళయి ఏ ఆర్నెల్లో అయినట్టు అనిపిస్తుంది; పిల్లాపీచూ లేకపోవడమూ, ఆ హూషారు చూస్తే ....

ఆ అబ్బాయికి ఎందులో ఉద్యోగమో ఊహించలేకపోయాం గాని, మొత్తంమీద ఇంటి దగ్గిరే ఉంటాడు, రోజులో చాలాభాగం.

వాళ్ళ రేడియో పగలస్తమానం అలా మోగుతునే ఉంటుంది. పొద్దున ఆరున్నరకి రామాకృష్ణా అని భక్తిరంజనితో మొదలు. ఏడుగంటలకి వార్తలైనా పెట్టకుండా సిలోన్. పదిగంటలకి సిలోన్ స్టేషన్ మూసేస్తే సింహళ భాషా సిలోన్, పదకొండు గంటలకి మళ్ళీ బొంబాయి. పన్నెండున్నర నించీ రెండువరకూ తెలుగు ప్రోగ్రాములు, రెండునుంచి మూడువరకూ మళ్ళీ హిందీ పాటలు. నాలుగున్నర నించి సిలోన్. ఇహరాత్రి పదకొండు గంటలేకాని, ఒంటిగంటేకాని - వాళ్ళు స్టేషన్ మూసేసి తాళం వేసుకొని వెళ్ళిపోవాలే తప్ప, వీళ్ళు ఆపరు. నాటికలూ, కథానికలూ, లలిత సంగీతం, పిల్లలు లేకపోయినా పిల్లల ప్రోగ్రాములు, మధ్యమధ్య రేడియో సంక్షిప్త శబ్దచిత్రాలూ ఏవీ పోనివ్వరు వాళ్ళు. పాటలు! పాటలు!! పాటలు!!! వార్తలైనా పెట్టకుండా పాటలు పెట్టేస్తారు. సంసారం చేస్తూ పదేళ్ళు కావస్తోంది.; మాకే పాటలమీది మోజుపోలేదు. ఇంకా కుర్రాళ్ళు, వాళ్ళకెలా పోతుంది? అనుకునే వాళ్ళం నేనూ, మాణిక్యం, సందర్భం వచ్చినప్పుడు.

అతను పెళ్ళాన్ని బలే చిత్రమయిన పేర్లతో పిల్చేవాడు.

సుబ్బలక్ష్మి కాబోలు ఆ అమ్మాయి పేరు. ఔనా! 'ఒసే, ఓవిడా, సుబ్బీ, సుబ్బులూ, సుబ్బమ్మా. సుబ్బలక్ష్మీ' యిలా పిలవడం - ఆ అమ్మాయి పాపం 'ఉరుకోండీ, ఏమిటా గావుకేకలూ! ఎవరైనా వింటే నవ్వుతారు కూడానూ!' ఆమె చాలా సిగ్గుతో ఎంతో మృదువుగా అనటమూ మాకు వినబడేవి; నేనూ మాణిక్యం ఒకరి మొహా లొకరు చూసుకోవడం, పైకి నవ్వుకోడం.

పైకి నవ్వుకోడం-అని ఎందుకన్నానంటే - మా కలాటి అదృష్టం లేదు గనక. మొదట్నించీ పదిమంది ఉన్న ఇంట్లో మెసిలేం. పెళ్ళయిన కొత్తలో - అంటే మూడేళ్ళవరకూ - నావసే దైనా మాణిక్యం వరకూవచ్చేదేకాదు. చెల్లెళ్ళూ, అమ్మా, తమ్ముళ్ళూ వీళ్ళ సాన్నిధ్యంతో మే మిద్దరం ఎప్పుడోగాని ఏకాంతంగా ఉండడమే వడేదిగాదు. అంతగా మాణిక్యంతో ఏదేనా అవసరమొస్తే పక్కనే ఉన్న మా తమ్ముడినో చెల్లెల్నో పిల్చి - 'ఒదిన్ని ఇలా రమ్మనూ' అని చెప్పడం తప్ప, పిలవవలసిన అవసరం కలిగేది కాదు. తరవాత ఉద్యోగరీత్యా వేరే ఊళ్ళో కాపురంపెట్టినా మూడో మనిషి ఎవరో మాతో ఉంటూనే వచ్చారు. అధమం ఒక ప్యూన్ అయినా ఉండేవాడు. 'అమ్మగార్ని ఒకసారి ఇటు రమ్మనవోయ్' అని చాలామాట్లు తప్పించుకున్నాన్నేను మాణిక్యాన్ని పిలవడాన్నుంచి. పోనీ ఎక్కణ్ణించో ఇంటికి వచ్చి తలుపుకొట్టేటప్పుడు - తలుపు కొట్టి కొట్టడంలో తపీమని తెరవడమూ-యిలా పిలవవలసిన తతంగం లేకుండానే కాలక్షేపంఅయిపోతోంది. ఏదైనా రాసుకుంటూ వున్నప్పుడు మధ్యలో కాఫీ కావల్సివస్తే - 'ఇదిగో. కొంచెం కాఫీ లాంటిది యేర్పాటు చెయ్యి!' అని ఓ కేకపెట్టడం: ఇలా అయిపోతుంది. కొన్నాళ్ళు మాణిక్యం నన్ను సాధించింది.

'ఇదిగో, అదుగో ఏమిటండీ! పేరు పెట్టి పిలవలేరా?' అని.

కాని అదేమిటో ఆమెని 'మాణిక్యమూ' అనిపిలవబుద్ధెయ్యేదు నాకు. అలా పిలిస్తే అదేదో ప్రాణంలేని వస్తువుని పిల్చినట్టు బాధ కలుగుతుంది. లక్షణమైన అర్ధాంగిని, ప్రాణంలేని వస్తువుని పిల్చినట్టు పిలవలేకపోయేవాణ్ణి. అసలు ఇన్నింటికీ మూలం పిలవకుండానే దాదాపు అన్ని పన్లూ అయిపోవడమేనని ఒప్పుకోక తప్పదు. 'చక్కటి పేర్లు ప్రపంచంలో అన్నివుంటే మాణిక్యమని పెట్టేదేమిటి నీకు మీనాన్న!' అని దెప్పుతుంటా న్నేను.

మాకు మరీ నవ్వొచ్చే సంఘటన వొకటి ఇంచుమించురోజూ జరుగుతూ వుంటుంది. ఆ అబ్బాయి బాత్రూములో దూరి స్నానం చేస్తూవుంటాడు. కొంతసేపు పోయాక 'తువ్వాలోయ్!' అని గట్టిగా కేక వేస్తాడతను.

'అబ్బ రోజూ ఎంతకనండీ! తువ్వాలు పట్టుగెళ్ళకుండా స్నానానికివెళ్ళడం మా బాగా అలవాటయిపోయింది!' అంటుందా అమ్మాయి. తువ్వాలు తీసుకెళ్ళి బాత్‌రూమ్ దగ్గర నిలబడుతుంది గాబోలు!

'సుబ్బులూ! తువ్వాలోయ్!' అంటాడతను ఇంకా గట్టిగా.

అమ్మాయి హడలి పోయినట్టు - 'అబ్బ! తెచ్చానండీ! ఏమిటా కేకలు .... ....? తలుపు తెరవ మంటారా?' అంటుంది.

'తెరవ్వే? నాని పోతున్నానూ!' అంటా డతను.

ఆ అమ్మాయి తలుపు తెరుస్తుంది గాబోలు! అతను స్వరం కొంచెం తగ్గించి 'నీకు తెలియని రహస్యం నా దగ్గరేముందే, వెర్రిదానా!' అంటాడు.

చేస్తున్నపని మర్చిపోయి, ఈ దృశ్యం అంతా కళ్ళల్లోకి తెచ్చుకుంటూ, బహూశా అతను బాత్‌రూమ్‌లో తువ్వాలుతో ప్రవే

శించిన ఆ అమ్మాయి బుగ్గమీద వొక్కచిటికవెయ్యడం దగ్గర్నుంచీ మేమిద్దరం వేరే వేరేగా వూహించుకుని - వొకరి మొహం వొకరు చూసుకుంటాం తెల్లమొహా లేసుకుని.

అది మాకే ఎందుకు జరుగకూడదని అనిపిస్తుంది గాబోలు. అలాటి తియ్యటి సంఘటనలు ఇప్పుడు ఈ వయస్సులో ఏం జరుగుతాయి; జరిగినా ఏం బాగుంటాయి; పదహారేళ్ళ పడచుగా తనూ ఇరవైఏళ్ళ కుర్రాడుగా నేనూ ఉన్నప్పుడు ఛాన్సు విడిచిపెట్టుకుని మా యిద్దరి కళ్ళలోనూ, అప్పుడు ప్రస్ఫుటంగా కనబడే దిగులు- 'వెళ్ళిపోయింది తియ్యటి కాలం - మళ్ళీ రమ్మంటే రాదు.' అనే బరువైన పొగ - అది నే నెలా చెబితే మీకు అర్థమౌతుంది;

అనుకోకుండా ఎప్పుడో వోసారి (వారానికోసారికి తక్కువ ఉండదు) సినిమాకి వెళతారు వాళ్ళు. రాత్రి ఏడు గంటలకే సద్దుమణిగినట్టు అయిపోతుంది. మేము ఇద్దరమూ వున్నా ఒంటరిగా వున్నట్టూ, ఎవరో పదిమంది ఇంట్లోవాళ్ళు హఠాత్తుగా ఎక్కడికో వెళ్ళిపోయినట్టూ, ఏదో వెలితిగా ఉన్నట్టూ, బాధ కలగడంతో తెలుస్తుంది. వాళ్ళు సినిమాకి వెళ్ళినట్టు, బిక్కు బిక్కుమంటూ పది గంటల రాత్రిదాకా గడియకోసారి గోడ అవతలినించి రావలసిన శబ్దాలు రాలేదన్నట్టు సాభిప్రాయంగా ఒకరి వేపొకరు చూసుకుంటూ గడుపుతాం మేము. అప్పుడు వొస్తారు వాళ్ళు. ఆ నిశ్శబ్దములో, వాళ్ళు చేసే గిన్నెల చప్పుడూ, కంచాల చప్పుడూ, ఆఖరికి నేతి గిన్నెలో చెమ్చా వొదిలిన చప్పుడూ అన్నీ ఎంతో స్ఫుటంగా, అహ్లాదకరంగా వినిపిస్తాయి మాకు. నిద్దరట్టదు!

భోంచేసి ఇవతలికొచ్చి అతను హుషారుగా అప్పుడే చూసొచ్చిన సినిమాలో పాటది కాబోలు, వో చరణం ఎత్తుకుంటాడు. అతనికి పాడటం రాదు. కాని వచనంలా చదివేసినా అదే సంగీతంలా

వుంటుంది మాకు. నోళ్ళు తెరచుకుని వింటాం. (చెవులు ఎలాగూ తెరుచుకొనే వుంటాయి.) అలాంటి సమయంలో సంభాషణ ఎలా వుంటుందనీ;

'సుబ్బులూ! తమలపాకుల్లేవూ? తమలపాకులు అయిపోక ముందే చెప్పమని ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోవుగదా. ఇప్పుడీ అర్ధరాత్రప్పుడు ఏసందులోకి వెళ్ళడం తమలపాకుల కోసం?'

'అబ్బా! ఈ ఒక్క రాత్రి గడుపుకొందురూ! పొద్దున చూదాం?'

'అదే వొద్దన్నాను. ఎందుకు గడుపుకోవాలి? అందులో తమలపాకుల్లేకుండానా! అసలుతమలపాకులంటేఏమిటో, తాంబూల మంటే ఏమిటో, నీకేమైనా తెలుసునా!'

'ఊరుకోరు గదా; చిన్నతనం మీరునూ!' లేకపోతే —

'అబ్బా! ఆ రేడియో కట్టేద్దురు ఇహ. చాలా రాత్రయిందీ!'

'ఎంతమాట! రాత్రి సద్దుమణిగేక క్షీరాన్న భోజనం. ఆ తరవాత పక్కమీద చలితో దెబ్బలాడుతూ అనుకొని పడుకోడమూ- ఆసందట్లో రసవంతమయిన సన్నటి సంగీతమూ — వీటి మహిమ ఎలాటిదో నీకెంత చెప్పినా బోధపడదేమే!'

'మీతో మాట్లాడడం నాదే పొరపాటు. మీ కెప్పుడూ ఒకటే సొద; అదేదో శాస్త్రం చెప్పినట్టు.'

ఇంకో సందర్భంలో —

సినిమాలో పాటకాబోలు, వరసలేకుండా, వచనమూకాకుండా వున్న ధోరణిలో ....

'చిలకా గోరింకలముగా ఆలూ మగలం హాయిగా, ఆ ....' అని అతనూ —

'అయ్యో, ఉండండి! ఏమిటండీ మరీ చిన్న పిల్లాళ్ళాగా! చూశారా, ఎలా నలిగి పోయిందో!' అని ఆ అమ్మాయి.

'హోశ్! నా చేతుల్లో నలగడంకంటె పవిత్రమైన పనికూడా వుందిటే, నీ చీరకి,' అని అతనూ.

ఇలాటి సంభాషణలూ వినపడతాయి మాకు.

మాణిక్యం తల వొంచుకుంటుంది. నేను తల తిప్పుకుంటాను. అది సిగ్గుకాదు. ఏదో బాధ. ఆ బాధ నాకూ తెలుసును. గతించి పోయిన కాలాన్ని చూసీ, వొలికిపోయిన పాలని చూసీ మనం పడే బాధ అది. మేం ముప్ఫయ్యేళ్ళకే ముసలివాళ్ళమైపోయామే అని చెప్పుకోలేక, ఒప్పుకోలేక పడే బాధ అది. లోకంలో చాల బాధల కంటె, ముసలి వాళ్ళమయిపోయామని ఒప్పుకోవలసి వచ్చినప్పుడు పడేబాధ దారుణం!

'నువ్వెప్పుడైనా చూశావా, వాళ్ళని?' అన్నాను మాణిక్యంతో ఒకసారి మెల్లిగా, వాళ్ళకి వినబడిపోతుందేమో అనే భయంతో.

'లేదండీ, గోడలు ఎత్తు.'

గోడమీంచి చూదామని ప్రయత్నం చేసిందన్నమాట. లేక పోతే ఆ మాట ఎందు కొస్తుందీ? మానవులకి సృష్ట్యాదినించీ వున్న కుతుహల విశేషమే అది!

'పోనీ అ పిల్లలైనా కనిపించలేదా?'

ఎలాటిప్రశ్న! ఆ కుర్రాణ్ని చూదామనే మాణిక్యం ప్రయత్నించిందనీ, అత నెల్లావుంటాడో కనిపించకపోతే పోయాడు! పోనీ ఆ అమ్మాయేనా కనిపించలేదా అనీ గాబోలు దీని అర్థం. మాణిక్యం అతనికోసం చూడడంలో వున్న తప్పునూ, నేను ఆపిల్ల విషయంలో

చూపిన కుతూహలంలో వున్న న్యాయాన్నీ తనలో ఇముడ్చుకొన్న ప్రశ్న ! మనలో ఇంత కుళ్ళెందుకుంటుందో !

'లేదండీ !'

'సినిమాకి వెళ్ళేటప్పుడు చూడవలసింది. నువ్వెప్పుడూ ఇంటోనే ఉంటావుగా !'

'చూదామనే అనుకుంటాను. కాని అదేమిటో - గప్‌చిప్‌గా వెళ్ళిపోతాడు. ఒక అరగంట పోయాక తట్టుంది నాకు, సందడిలేదే అని; అప్పుడు అనుకుంటాను; సినిమాకి వెళ్ళేరు గాబోలని; అంది మాణిక్యం.

మేం సాధారణంగా సినిమాకి వెళ్ళలేం. డబ్బులేక కాదు. నాకు, ఏరోజూ ఆరుగంటల లోపున ఆఫీసుపని తెమలదు. ఇహ ఆరింటికి ఇంటికి వచ్చినా పగలల్లా శ్రమపడి వుండడాన్ని ఈజీ ఛైర్లో కూచో బుద్ధి వేస్తుంది. ఆ జనం మధ్య టిక్కెట్లకి నానా అవస్థా పడి ఇంకో మూడు గంటలు సినిమాలో- కుర్చీలో కూచోక పోతేయేం, అనిపిస్తుంది. పోనీ సెలవొచ్చినా అదో రకంగా వుండి సినిమా తలపు కలగదు.

'రిక్షాలో వెళతారు గాబోలు !' అన్నాను.

'బావుందండీ! రిక్షాలో వెళ్ళక ఇంతదూరం నించీ నడిచి వెళ తారా యేమిటి?' అంది మాణిక్యం.

నా ఉద్దేశం అదిగాదు, ఇద్దరూ ఒక్క రిక్షాలో కూచుని సర సంగా స్పృశించుకుంటూ ఒకరి నడుంమీద ఒకరు చెయ్యివేసుకుని వెళతారా అని. ఎందుకంటే మా కా భాగ్యం లేదు. మేమిద్దరం వొక్క రిక్షాలో పట్టం. పైగా నా కెందుకో మాణిక్యం పక్కన రిక్షాలో కూచు న్నప్పటి కంటె సైకిలు మీద వొంటరిగా కూచుంటూనే హాయిగా

వున్నట్టుంటుంది. కాని ఎందుకో ఆమాట అనడానికి జంకి వూరుకున్నాను.

* * *

ఒక నెల అయివుంటుంది. మా పొరుగు వాళ్ళతో మేం పరిచయం చేసుకోలేదు. మొదట్లో అశ్రద్ధ చేయటం; కొసకి 'మేం ఈ ఇంట్లో నెల్లాళ్ళ కిందట దిగాం' అని చెప్పడం అంత బాగా అనిపించక పోవడం, మొత్తంమీద అలా అలా మా స్నేహం వాయిదా పడిపోయింది. చివరికినెలదాటేసరికి వాళ్ళతో స్నేహం చేసుకుందామన్న మా కోరిక అలా అడుగంటిపోయి ఇంకిపోయింది, కారణం ఇదీ అని నే నెక్కడ చెప్పగలను? అదేదో బాధ. ఏవూరు వెళ్ళినా ఇరుగు పొరుగమ్మల్ని 'అక్కయ్యగారూ' అని పిల్చే మాణిక్యం ఇక్కడఅక్కయ్యగారూ అనిపిలిపించుకోవలసి వస్తుందన్న భయం వొకటి ఉందను కుంటాను.

ఇహ, వాళ్ళు గడుపుతున్న కాలం. దాని పేరు చిన్నతనం కాబోలు - అందులో వాళ్ళు అనుభవిస్తున్న ఖులాసా. దాన్ని మేం వొకరి కొకరు ఎలా తెలియజేసుకొంటాం? వాళ్ళు చాలా అనుచితంగా, అశ్లీలంగా ప్రవర్తిస్తున్నారనీ, పశుప్రవృత్తి తప్ప మానవౌచితి వాళ్ళలో లేదనీ, ఎంతసేపు మాటల్లో, చేతల్లో 'అదే' గొడవ అనీ - తీసుకున్నట్లు నటించి, వాళ్ళని అసహ్యించుకుంటున్నట్టూ నటిస్తున్నాం. లోపలమాత్రం వాళ్ళు మాకు అందనిదేదో అనుభవిస్తున్నారని అసూయపడుతున్నాం, ఇది మా ఇద్దరికీ వేరే తెలిసినా, ఒకరికొకరు చెప్పుకోలేకపోయినా, ఒకరికి తెలుసునని ఇంకొకరికి తెలియనట్టు నటించి, వొకరి కొకరు ఎప్పుడూ చెప్పుకోలేదు. ఇహమీదట చెప్పుకోం కూడాను.

ఎందుకంటే మొన్న ఆదివారం —

పొద్దున్న పదకొండు గంటలకి నేను స్నానం భోజనంచేసి యదాలాపంగా వీధి గుమ్మంలోకి (అదే, గోడకివేసిన ద్వారం దాటి మెట్టుమీదికి) వచ్చేసరికి పొరుగు ఔట్‌హౌస్ ద్వారంకూడా తెరిచి వుండడమూ, అక్కడ వొకాయన నిలబడ్డమూ జరిగింది. ఆయనకు యాభై ఏళ్లు వుండొచ్చు. పల్చటి గ్లాస్కోమల్లు పంచె కట్టుకున్నాడు; డక్కా మజ్లిన్ కళ్ళీలాల్చీ తొడుక్కున్నాడు. లాల్చీ కాలర్లోంచి బంగారు గుండీలు, చెయినూ కనిపిస్తున్నాయి. అప్పుడే తాంబూలం సేవించాడు గాబోలు. నోరు ఎర్రగా ఉంది. ఇంకా తమలపాకుల ఆఖరిపట్టు నమల్తూ ఓ చేత్తో పళ్ళుగొలుక్కుంటూ నించున్నాడతను. (లోపల్నుంచి రేడియో మోగుతూనే వుంది)

రెండు నిమిషాలు ఇద్దరం వొకర్నొకరం చూసుకున్నాం. ఎవరం మాట్లాడలేదు. ఆఖరికి ఆయనే అడిగాడు.

'ఈ ఔట్ హౌస్‌లో అద్దెకి దిగారా ?'

'అవునండీ'

'ఏదైనా వుద్యోగమా ?'

'కమ్మర్షియల్ టాక్స్ ఆఫీసులో యూ డీ సీ నండీ!

'బాగానే వుంటుంది. వేరే బాత్రూంకూడా కట్టించినట్టున్నాడు. ఎంతద్దె యిస్తున్నారు ?

'ముప్ఫై'

'వెధవ ? ఇదివరకు ఇరవైకే యిచ్చాడు. ఆ బాత్రూంకోసం పదిరూపాయలా ! అద్దెకుండేవాడు ఇంటి కామందైతే ఇలాగే వుంటుంది. ఇంకో డెబ్భైపడేస్తే బంగళా అద్దె అంతా కిట్టుబాటై పోతుంది.'

'ఏదో లెండి. ఊళ్ళో మంచి ఇల్లుదొరికితే మారిపోతాం. ఈ పేట అన్నిటికీ దూరం .... మీ రెవరో తెలుసుకోవచ్చా?'

'ఓ! .... ఈ బంగళా నాది ! మీరుండేదీ, యిదీ వోసారే కట్టించాం. ఒకటే ప్లాను కూడానూ, ఔట్ హౌస్ దగ్గర్నుంచి'

'మీ కెందులో అయినా వనండీ?'

'నాకా ? నాకెందుకూ పనీ ?'

ప్రశ్న అడిగినందుకు నొచ్చుకున్నాను. డబ్బున్నవాణ్ని ఉద్యోగం చేస్తున్నావా, ఊడిగం చేస్తున్నావా అని అడిగితే అవ మాన పడతాడు మరి.

'ఆహాఁ అడిగాను. ఏదన్నా ప్రాక్టీసు అదీవుందేమో అని....' అంటూ సర్దుకున్నాను.

'లేదండీ. ఇక్కడికి ఆరుమైళ్ళదూరంలో మా లేండ్సు వున్నాయి. దానిమీద ఈ బంగళా అద్దె వొస్తుంది, ఏదో....'

అదేం ఖర్మమో! ఉన్నవాడు ఉందనీ ఒప్పుకోడు. లేనివాడు లేదనీ ఒప్పుకోడు. ఏదో.... అంటారు; 'ఏదో !' ట !

అసలు ప్రశ్నే వుండిపోయింది; ఈ ఔట్‌హౌస్‌లోని జంట ఈయన కొడుకూ, కోడలూ అయివుంటారేమో !

'ఈ ఔట్‌హౌస్‌లో మీ పిల్లలెవరయినా ఉంటున్నారండీ!' అన్నాను.

'మా పిల్లలెవరూ ఇక్కడ లేరండీ! మా పెద్దబ్బాయి హైద్రాబాదులో- గవర్నమెంటులో డిప్యూటీ సెక్రటరీగా వున్నాడు. రెండో వాడు ఈ ఊళ్లోనే డాక్టరు. వేరే ఉంటున్నాడులెండి. మాఅమ్మాయీ అల్లుడూ భిలాయ్‌లో ఉంటున్నారు. ఎలక్ట్రికల్ ఇంజనీరు అతను.' అన్నాడాయన.

'అయితే ఈ బోట్ హౌస్ అద్దెకిచ్చారా!'

'లేదండీ. ఇందులో నేనూ, నా వైఫ్ ఉంటున్నాంగా!'

ఆ తర్వాత జరిగిన సంభాషణ నాకు జ్ఞాపకం లేదు. ఏదో అవమానం జరిగినట్టూ, దెబ్బతగిలినట్టూ బాధపడ్డాననుకుంటాను. ఏదో చెప్పి ఇంట్లో దూరాను.

* * *

ఇంక మేం మా పొరుగు బోట్ హౌస్ వాళ్ళతో పరిచయం చేసుకోం. వాళ్ళని చూస్తే మా కిప్పుడు చాలా అసహ్యం.

మా కంటె ఇరవయ్యేసి ఏళ్ళు పెద్దవాళ్ళయి ఉండి కూడా-మా అంతేసి కొడుకుల్నీ, కోడళ్ళనీ దేశాల మీదికి వదిలేసి — మాకంటె ఇరవై రెట్లు కులాసాగా, సరదాగా ఆనందం అనుభవిస్తున్నారనీ తెలిస్తే మాత్రం! మేం ఆ దంపతుల్ని క్షమించగలమా? ఏనాటికైనా వాళ్ళలా ఉండగలమా!?

ఛీ? అది ఎంత తప్పు! ఎంత అసహ్యం!! ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు? అలా ప్రవర్తించిన నాడు మనిషికీ, పశువుకీ ఇహ తేడా ఏముంది? ఇంతకీ కాలమహిమ!

ఇంకా ప్రపంచంలో ధర్మమూ, న్యాయమూ, నీతీ, ఇలా ఒక్క కాలిమీదైనా నిలబడి ఉన్నాయంటే, దానిక్కారణం ఎక్కడో కోటికొకరు నాలాంటివాళ్ళూ, మాణిక్యం లాంటివాళ్ళూ ఉన్నారు గనుక!

మా కెందుకూ! అలాంటి అసహ్యపు సరదాలూ మాకొద్దు; అలాంటి వాళ్ళతో స్నేహమూ వొద్దు. సిగ్గు! సిగ్గు!!